సప్లయ్ చానల్ మరమ్మతు చేయరూ..

- చానల్‌లో పేరుకుపోయిన పూడిక
- ఆంధ్రా నుంచి కర్ణాటకకు వెళ్తున్న వర్షపు నీరు
- చెక్‌డ్యాం ఎత్తు పెంచాలని రైతుల విన్నపం



పూడిక, పిచ్చి మొక్కలతో నిండిన సప్లయ్ చానల్



తక్కువ ఎత్తు ఉన్న చెక్‌డ్యాం

రొళ్ల: రొళ్ల చెరువుకు నీరందించే సప్లయ్ చానల్ మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో వర్షపు నీరు వృథా అవుతోంది. సప్లయ్ చానల్‌లో పూడిక పేరుకుపోవడంతోపాటు పిచ్చిమొక్కలు పెరగడంతో వర్షపునీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. హొట్టేబెట్ట పంచాయతీలోని హొట్టేబెట్ట, కల్లురొప్పం, గొల్లహట్టి, కొత్తపాళ్యం , కొత్తపాళ్యం తాండ, కొడగార్లగుట్ట కాలనీ, కొడగార్లగుట్ట గ్రామాలు అనుకుని వేల ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు వృథా కాకుండా ఉండాలన్న ఉద్దేశంతో కొడగార్లగుట్ట గ్రామ సమీపాన 1996లో రూ.5 లక్షలతో కిలో మీటర్ల మేర దూరం సప్లయ్ చానల్ నిర్మించారు. చానల్ ద్వారా వర్షపు నీటిని రొళ్ల చెరువుకు మళ్లించారు. దీంతో రొళ్ల చెరువు నిండి వందలాది ఎకరాలు ఆయకట్టు భూములు సాగులోకి వచ్చేవి. వీటితోపాటు అగళి మండలం దొక్కలపల్లి, భీరనపల్లి, హళ్లికెర, ముత్తేపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో పుష్కలంగా నీరు లభించేది.

బీడుగా ఆయకట్టు భూములు...

ఏళ్ల తరబడి చానల్ గురించి పట్టించుకోకపోవడంతో పూడిక పేరుకుపోయి పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో వర్షపు నీరు చానల్ గుండా ప్రవహించకపోవడంతో దిగువనున్న కర్ణాటక ప్రాంతానికి వృథా వెళ్తున్నాయి. సప్లయ్ చానల్ సమీపాన కర్ణాటక వైపు నీళ్ల వెళ్లకుండా అప్పట్లో చెక్‌డ్యాంను నిర్మించారు. అయితే చెక్‌డ్యాం ఎత్తు పెంచక పోవడం వల్ల వర్షపు నీళ్ల చానల్ గుండా వెళ్లకుండా దిగువ ప్రాంతం అయిన కర్ణాటక వైపు తరలి పోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల ఆర్డీటీ సంస్థ రూ.7 లక్షలతో సప్లయ్ చానల్ మరమ్మతు పనులు చేపట్టారు. అయినా ప్రయోజనం కనిపించడం లేదు. చెక్‌డ్యాం ఎత్తును పెంచడంతోపాటు చానల్‌లో నీరు ప్రవహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కొడగార్లగుట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి శిథిలావస్థకుచేరిందని, వెంటనే కొత్త బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

చెక్‌డ్యాం ఎత్తు పెంచాలి



నాకు రొళ్ల చెరువుకు కింద ఒకటిన్నర ఎకరా భూమి ఉంది. గతంలో చెరువు నిండితో వరి సాగు చేసేవాడిని. చానల్‌లో పూడికతో నీళ్ల ఎక్కడికక్కడే నిలబడుతున్నాయి. చానల్ పూడిక తీయడంతోపాటు కొడగార్ల గుట్ట సమీపాన ఉన్న సప్లయ్ చానల్ వద్దనున్న చెక్‌డ్యాం ఎత్తు పెంచాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నగేష్ రంగారెడ్డి, ఆయకట్టు రైతు, రొళ్ల

పూడిక తొలగిస్తే మేలు



సప్లయ్ చానల్‌లో పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలు తొలగించి నీరు సక్రమంగా మళ్లే విధంగా చూడాలి. చానల్‌లో పూడిక తీత పనులను ఆర్డీటీ వారు ఇటీవల చేపట్టినా అది ఏమాత్రం ఉపయోగం పడలేదు. రొళ్ల చెరువు ఆయకట్టు కింద ఉన్న నాలుగు ఎకరాల్లో వర్షాధారం కింద రాగి, వేరుశనగ, ఉలవలు, జొన్న సాగు చేశా.

-బసవరాజు, ఆయకట్టు రైతు, రొళ్ల

నీరు వృథా కాకుండా చూడాలి



అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు వృథాగా కర్ణాటక ప్రాంతం వైపు పోతున్నాయి. కొడగార్ల గుట్ట గ్రామం వద్ద సప్లయ్ చానల్ ఉన్నా నిరుపయోగంగా మారింది. అధికారులు సప్లయ్ చానల్‌ను మరమ్మతు చేయించి వర్షపు నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి.

– దేవరాజు, దొక్కలపల్లి, అగళి మండలం

క్లుప్తంగా

భోజన ప్యాకెట్ల పంపిణీ



అన్నం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో బాబయ్య దర్గా వద్ద దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా శిష్యులు భారీ ఎత్తున భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆదివారం బాబాయ్య దర్గా పీఠాధిపతి తాజ్ బాబా జన్మదిన వేడుకలను ఆయన శిష్యులు ఘనంగా నిర్వహించారు. బాబయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం బాబాయ్య దర్గా, ఆర్టీసీ బస్టాండ్, దర్గా సర్కిల్, మార్కెట్ ఏరియా తదితర ప్రాంతాల్లో పేదలు, వృద్ధులు, యాచకులకు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేశారు.

క్రీడలను ప్రోత్సహించాలి



బ్యానర్ విడుదల చేస్తున్న సీఐ రాఘవన్

పెనుకొండ: ఉపాధ్యాయులు క్రీడలను ప్రోత్సహించాలని సీఐ రాఘవన్ తెలిపారు. పట్టణంలోని సీఐ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల జిల్లా స్థాయి టీచర్స్ షటిల్ బ్యాడ్మింటన్ బాస్కెట్‌బాల్, వాలీబాల్ పోటీల బ్యానర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ 100, 200, 400 మీటర్ల పరుగు పందెం, స్పీడ్ వాకింగ్, జావెలిన్ త్రో, క్యారమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు భూతన్న, నారాయణస్వామి, నబి, కృష్ణానాయక్,రవీంద్రనాథ్, గోవిందప్ప, నరసింహులు, శేషాద్రి, సుదర్శన్, షణ్ముఖ పాల్గొన్నారు.

నీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

పెనుకొండ: సత్యసాయి తాగునీటి పథకం సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. 10 రోజులుగా సమస్యల పరిష్కారానికి సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నాయకులు బాబావలి, మహబూబ్‌బాషా, నాగప్ప, రెడ్డప్పరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెంపే గౌడ జయంతి



ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని ముగదాళబెట్ట గ్రామంలో బెంగుళూరు నగర నిర్మాత కెంపే గౌడ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎలె రాంపుర మఠాధీశుడు హనుమంతనాథ స్వామీజీ మాట్లాడుతూ బెంగళూరును మహా నగరంగా తీర్చిదిద్దిన ఘనత కెంపే గౌడకు దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు వేకువ జామున సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు.

ఇనగలూరులో పారిశుధ్య పనులు



పనులు పర్యవేక్షిస్తున్న ఈఓఆర్డీ పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనోనాయక్

అగళి: ఇనగలూరు గ్రామంలో ఆదివారం పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా మురికి కాలువలను శుభ్రం చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈఓఆర్డీ పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనోనాయక్, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఏఈ విజయకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు అరసికెరె విద్యార్థులు



విజేతకు అర్హత పత్రం అందిస్తున్న సుమలత

పావగడ: అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాలూకా స్థాయి సైన్స్ విభాగాల పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపిక య్యారు. ఈ సందర్భంగా విజేత హేమలత కు వెంకటాపురం సైన్స్ టీచర్ సుమలత అర్హత పత్రాన్ని అందించారు. స్థానిక గురుభవన్ లో ఆదివారం జరిగిన సైన్స్ పోటీల్లో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజ్ఞాన నాటకం, విజ్ఞాన విచార గోష్ఠి, విజ్ఞాన వస్తు ప్రదర్శన పోటీల్లో అరసికెరె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. విజ్ఞాన నాటకంలో సుష్మిత బృందం, విజ్ఞాన వస్తు ప్రదర్శనలో ప్రథమ స్థానంలో గెలుపొందిన యోగేశ్ నాయక, వినయ్ కుమార్, విజ్ఞాన విచారగోష్ఠి లో ద్వితీయ స్థానంలో గెలుపొంది న విద్యార్థిని హేమలత జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను హెచ్‌ఎం రేణుకాచార్ తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సత్యభామ రుక్మిణీ కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

అమరాపురం: స్థానిక ఈశ్వరీయ బ్రహ్మకుమారీ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహకురాలు పుష్పక్క శ్రీ కృష్ణుని లీలల గురించి వివరించారు. ఎవరైతే దైవ కార్యాలు చేస్తారో వారికి ఆ దేవుడు తప్పక మంచి ఫలితాన్ని ఇస్తాడన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మనఃశాంతి పొందుతామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీ కృష్ణ, రుక్మిణి, సత్యభామ తదితర వేషధారణలతో ఆకట్టుకున్నారు. భక్తి పాటలకు చిన్నారులు నృత్యం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

మడకశిర: పట్టణంలోని యాదవ కళ్యాణ మంటపంలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, యాదవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివలింగప్ప, విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి చిక్కప్పయ్య, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, వైబీహళ్లి, బేగార్లపల్లిక్రాస్, కదిరేపల్లి, జంబులబండ, హల్కూరు తదితర గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తామని ఆ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ విగ్రహాల వద్ద సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ ఆదివారం తెలిపారు. ఉదయం 9:30 గంటలకు మడకశిర రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

పరిగి: మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రొద్దంలో..

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ వర్ధంతి సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లేపాక్షిలో..

లేపాక్షి: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద సోమవారం మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరవాలని కోరారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ శేఖర్

గోరంట్ల: మండల వ్యాప్తంగా వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐ శేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని వినాయక సేవా సమితిలు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే మండపల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కమిటీలపై ఉంటుందన్నారు.

బస్టాండు ప్రాంగణం చదును



గుంతల్లో మట్టి వేసి చదును చేసిన దృశ్యం

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండులో వర్షం రావడంతో చిత్తడిగా మారింది. దీంతో స్థానిక సర్పంచ్ వాగేష్, ఈఓ భాస్కర్ బస్టాండులో మట్టి తోలించి చదును చేయించారు. దీంతో ప్రయాణికులు, వాహనాల చోదకులు సర్పంచ్, కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

గోరంట్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. ఆదివారం బూదిలి గ్రామ పంచాయతీలోని పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. బూదిలి మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల అభివృద్ధే లక్ష్యంగా కులమత రాజకీయాలకతీతంగా అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, కరోనా మహమ్మారి లాంటి విపత్కర పరిస్థితులున్నా ప్రతి హామీనీ నెరవేర్చారన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు సూపర్‌సిక్స్ పేరుతో పథకాలు అందిస్తామని నమ్మబలికారని, తీరా అధికారంలోకొచ్చిన తర్వాత ఏ ఒక్కటీ అమలు చేయలేదని, చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు విమర్శించారు.

రెడ్ బుక్కు రాజ్యాంగం అమలు చేస్తున్నారు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీ నిరంతరం దాడులు చేస్తూ, రెడ్ బుక్కు రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఉషశ్రీచరణ్ విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పక్షాలకు 60 శాతం ఓట్లు వస్తే.. వైఎస్సార్‌సీపీకి 40శాతం ఓట్లు పడ్డాయన్నారు. దీన్నిబట్టి చూస్తే ఇప్పటికీ, ఎప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం తగ్గలేదన్నారు. రాబోవు ఐదేళ్ల కాలంలో పార్టీ శ్రేణులు సమష్టిగా టీడీపీ, దాని మిత్రపక్షాలు చేస్తున్న దౌర్జన్యాలు,అక్రమాలు ఎండగట్టడానికి ప్రతి కార్యకర్త, నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు నార్శింపల్లి గ్రామ పంచాయతీ ఎర్రబల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పద్మనాభరెడ్డిని ఉషశ్రీచరణ్ పరామర్శించారు. అనంతరం తాటిమాకులపల్లికి చేరుకొని ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన భాస్కరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత మృతి



రాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, జెడ్పీటీసీ అనంతరాజు

రొళ్ల: రంగసపల్లికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత రంగసపల్లి రాయుడు (66) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సీనియర్ నేత విజయ రంగేగౌడు, నాయకులు నగేష్‌రంగారెడ్డి, నాగేంద్ర, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులు రాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యూపీఎస్ వద్దు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

రొళ్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్ తమకు వద్దని డీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతిప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సీపీఎస్ అమలు చేసిన సందర్భంగా విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మారడానికి పెన్షన్ భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అన్నారు. దీంతో పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయాన్ని ఒప్పుకోమన్నారు. డీటీఎఫ్ నాయకులు వినోద్‌కుమార్, రవినాయక్, మల్లేశ్వరనాయక్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ అశ్వర్థరెడ్డి మృతి

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ అశ్వర్థరెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. బెంగళూరులో ఉంటున్న అశ్వర్థప్ప అలియాస్ అశ్వర్థరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం వేకువజామున తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు అశ్వర్థప్ప మృతదేహాన్ని స్వగ్రామం శ్రీరంగరాజుపల్లికి తీసుకెళ్లారు. బంధువులు, కుటుంబ సభ్యులతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అశ్వర్థప్ప మృతదేహానికి నివాళులర్పించారు. గతంలో శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అశ్వర్థప్ప దానం చేశారు. నేటికీ ఆయన దాతృత్వాన్ని ప్రజలు కొనియాడుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం



బస్సు ముందుభాగం దెబ్బతిన్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైజంక్షన్‌లోని డివైడర్‌ను బస్సు ఢీకొనింది. హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనింది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతినింది. అయితే ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

గుండెపోటుతో లైన్‌మన్ మృతి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమరాపురం: మండల కేంద్రంలో విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు (51) గుండెపోటుతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో అమరాపురం నుంచి కర్ణాటకలోని శిర ప్రభుత్వాసుపత్రికి ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడి స్వగ్రామం చిట్నడకు గ్రామం కావడంతో అక్కడికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. మృతుడికి భార్య మంజుల, ముగ్గురు కుమారులు వున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న, జడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, విద్యుత్ ఏఈ సిద్ధేశ్వర, సిబ్బంది తదితరులు నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

తాగునీటి పైపులైన్ల మరమ్మతు



ఏఆర్ రొప్పంలో కొత్త పైపులైన్ వేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ఆమిదాలగొంది, గౌడనహళ్లి పంచాయతీల్లోని గ్రామాల్లో దెబ్బతిన్న వాటర్ స్కీమ్ పైపులైన్లు మరమ్మతు చేయించినట్లు సర్పంచులు గీత, పుట్టమ్మ తెలిపారు. ఆదివారం ఏఆర్ రొప్పం గ్రామంలో దెబ్బతిన్న పైపు లైన్‌ను తొలగించి కొత్త పైపులైన్ ఏర్పాటు చేసి కొళాయిలకు తాగునీరు సరఫరా చేయించామన్నారు. ఆమిదాలగొంది, జమ్మానిపల్లిలో దెబ్బతిన్న పైపులైన్ మరమ్మతులు చేశారు. గ్రామాల్లో దెబ్బతిన్న వాటర్ స్కీమ్ పైపులైన్ ద్వారా కొళాయిలకు కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టినట్లు సర్పంచులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని శిరివరంలోని తారక రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు షామీర్ బాషా, కృపసత్య రాజ్, ఆదినారాయణ, ముస్తఫ్, అహమ్మద్, శ్రీశైల, శివరాం, వనజ, మంజునాథ్, దాస్, వెంకటేశ్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రొళ్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లకు ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మడకశిర సీఐ రాజ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలకు వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన నాగప్ప

అమరాపురం: చిట్నడకు గ్రామానికి చెందిన నాగప్ప కుక్కను తప్పించబోయి బైక్‌పై నుంచి పడటంతో తీవ్ర గాయలయ్యాయి. వివరాలు.. నాగప్ప మడకశిరలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. హనుమంతనపల్లి గ్రామ వద్ద కుక్కలు అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాల పాలైన అతడిని స్థానికులు 108లో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.